## క్లుప్తంగా

### అంగన్‌వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ



తనిఖీ చేస్తున్న ఫుడ్ కమిషన్ మెంబర్ భారతి

రామగుండం: పట్టణ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ఫుడ్ కమిషన్ సభ్యురాలు ఎం.భారతి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముబారక్ నగర్–1, 2, అంబేద్కర్ నగర్–1 కేంద్రాల్లో ఆమె తనిఖీ చేసి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం పంపిణీతో పాటు పలు విషయాలను తెలుసుకున్నారు. లబ్ధిదారులకు కోడిగుడ్లను అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుష్పలత, అంగన్‌వాడీ టీచర్లు సబిత, సుజాత, స్వరూప, నీరజ, మాలతి తదితరులు పాల్గొన్నారు.

### లారీ అసోసియేషన్ సమస్యలు పరిష్కరిస్తాం



సమావేశమైన ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్

జ్యోతినగర్: రామగుండం లారీ అసోసియేషన్ సమస్యలకు పరిష్కారం చూపిస్తానని ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత హామీ ఇచ్చారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని జ్యోతిభవన్‌లో ఎమ్మెల్యే కోరుకంటి చందర్, జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్‌తో కలిసి రామగుండం లారీ అసోసియేషన్ సభ్యులతో సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం త్వరలోనే వారి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఐదో డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలని ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు కాంగ్రెస్ నాయకుడు ఎండీ రహీం వినతి పత్రం అందించారు. సమావేశంలో లారీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

### వాకింగ్‌ట్రాక్ పరిశీలించిన జీఎం



వాకింగ్‌ట్రాక్ పరిశీలిస్తున్న జీఎం మనోహర్, అధికారులు

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియా అబ్దుల్‌కలాం స్టేడియంలో వాకింగ్ ట్రాక్‌ను జీఎం ఎ.మనోహర్ బుధవారం పరిశీలించారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని సంస్థ యోగా సెంటర్లు, క్రీడా మైదానాలు, పార్కులు, జిమ్‌లు ఏర్పాటు చేస్తుందన్నారు. దీనిలో భాగంగా వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేస్తున్నామని దీన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాకింగ్ ట్రాక్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎస్ఓటూ జీఎం సలీం, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, సివిల్ డీజీఎం ధనుంజయ్ తదితరులున్నారు.

### క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. క్రీడలు స్నేహసంబంధాలను, దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ ఆడెపు వెంకటేశం, ఎంపీటీసీ తోట శ్రీనివాస్, నాయకులు మర్కు లక్ష్మణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### పారిశుధ్య సిబ్బందిని నియమించాలి

పెద్దపల్లిరూరల్: మున్సిపల్‌లో పనిచేసే పారిశుధ్య సిబ్బందిని నియమించి పారిశుధ్యం మెరుగు పర్చాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సురేశ్‌గౌడ్ బుధవారం మేనేజర్ శివప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. పారిశుధ్య పనులు చేసేందుకు అవసరమైనంత మంది సిబ్బంది, ఉద్యోగులను నియమించాలని కోరారు. 90 మంది సిబ్బందిని తొలగించిన అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. వీలైనంత త్వరగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి పారిశుధ్య కార్మికుల నియామకాలను చేపట్టాలని కోరారు. నాయకులు పూదరి చందు, జగదీశ్, అభిలాష్, ఖాజాపాష, నవీన్ పాల్గొన్నారు.

# పక్కాగా పంటల నమోదు

- కొనసాగుతున్న యాసంగి పంటల సర్వే
- పంటల నమోదుకు ఈనెల చివరి వరకు గడువు



ఎలిగేడులో పంట వివరాలను నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ఎలిగేడు: ఈ ఏడాది యాసంగి సీజన్ ప్రారంభమైంది. యాసంగిలో అన్నదాతలు సాగుచేసిన పంటల వివరాలను వ్యవసాయశాఖ అధికారులు సేకరిస్తున్నారు. ఎలిగేడు మండలంలో చెరువులు, కుంటలు, వ్యవసాయబావులు, ఎస్సారెస్పీ డీ–86 కాలువ ఆధారంగా వరి పంట సాగుతో పాటు మొక్కజొన్న, కందులు, పెసర, వేరుశనగ, కూరగాయాలు, ఆరుతడి పంటలను రైతులు సాగుచేస్తున్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరతోపాటు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు వీలుగా వ్యవసాయ శాఖ పంటల నమోదు కార్యక్రమాన్ని చేపట్టింది. అన్నదాతలు సాగుచేసి పంటల వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈవో)లు రైతుల పంటపొలాల వద్దకు వెళ్లి పరిశీలించి క్రాప్ బుకింగ్ యాప్‌లో నమోదు చేస్తున్నారు.

**ఈనెల చివరివరకు అవకాశం..**

మండలంలో ఈ యాసంగి సీజన్‌లో మొత్తం 14,,500 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తారని వ్యవసాయశాఖ అధికారులు పంటల ప్రణాళికలను రూపొందించారు. వరి 13900 ఎకరాల్లో మొక్కజొన్న 250 ఎకరాల్లో, ఆయిల్‌పామ్, వేరుశనగ, పెసర, కంది కూరగాయల పంటలు కలిపి 200 ఎకరాల్లో సాగుచేస్తారని అంచనా వేశారు. పంటల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని వ్యవసాయశాఖ కమిషనర్ రఘునందన్‌రావు ఆదేశాల మేరకు ఏఈవోలు మండలంలోని ఎలిగేడు, సుల్తాన్‌పూర్, ధూళికట్ట మూడు క్లస్టర్ల పరిధిలోని గ్రామాల్లో పంటల నమోదును నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు ముందుకు సాగుతున్నారు. ఆయా గ్రామాల్లో ఏఈవోలు పర్యటించి రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించి క్రాప్ బుకింగ్ యాప్‌లో రైతు పేరు, సర్వే నంబర్, వేసిన పంట తదితర పూర్తి వివరాలను నమోదు చేస్తున్నారు. ఈనెల చివరి వరకు పంటలనమోదు చేసే అవకాశం ఉండగా ఏఈవోలు పంటల నమోదు వేగవంతం చేశారు.

### వేగవంతంగా సాగుతోంది



మండలంలో యాసంగి పంటల నమోదు ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. ఏఈవోలు ఎలిగేడు, ధూళికట్ట, సుల్తాన్‌పూర్ క్లస్టర్ల పరిధిలోని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల వివరాలను సేకరిస్తున్నారు. ఇప్పటివరకు సేకరించిన వివరాలను క్రాప్‌బుకింగ్‌లో ఏఈవోలు నమోదు చేశారు. ఈనెల చివరి వరకు పంటలను నమోదు చేసేందుకు అవకాశం ఉంది.

– ఎం. ఉమాపతి, ఎలిగేడు మండలవ్యవసాయశాఖ అధికారి

# ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం





రామగుండం పట్టణం, గర్రెపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

జాతీయ ఓటర్ దినోత్సవంను బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రం, రామగుండం, మంథని నియోజకవర్గం కేంద్రాలు, గోదావరిఖని, సుల్తానాబాద్ పట్టణాలు, అన్ని మండల కేంద్రాలు, గ్రామాలు, పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ఓటర్ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ర్యాలీలు నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. పలు చోట్ల నాయకులు సీనియర్ ఓటర్లను సన్మానించారు. రాజ్యాంగం ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించించిందని, ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా విలువైన ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



మంథనిలో అధికారులు,విద్యార్థుల ప్రతిజ్ఞ

– సాక్షి, నెట్‌వర్క్

# కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



కంటి పరీక్ష చేసుకుంటున్న ఎంపీపీ స్రవంతి

పెద్దపల్లిరూరల్: కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లో కంటివెలుగు శిబిరాన్ని సందర్శించి వసతులను పరిశీలించారు. మండలంలోని రాగినేడులో బుధవారం ఎంపీపీ బండారి స్రవంతి కంటిపరీక్షలు చేయించుకున్నారు. అందరికి కంటి చూపు బాగుండాలనే ఆలోచనతో సీఎం కేసీఆర్ చేపట్టిన కంటి వెలుగులో అందరూ పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

సుల్తానాబాద్‌రూరల్: కంటి వెలుగును అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బాలాజీరావు అన్నారు. సుల్తానాబాద్ మండలం దేవునిపల్లిలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోమల, ఎంపీడీవో శశికళ, డాక్టర్ మధుకర్‌రెడ్డి, ఎంపీవో ఫయాజ్‌అలీ, సూపర్‌వైజర్ వెంకట్‌రెడ్డి, ఏఎన్ఎంలు పద్మ, అరుణ, రాజేశ్వరి, తదితరులున్నారు.

జూలపల్లి: కంటివెలుగు పథకంలో ప్రతి ఒక్కరు పరీక్షలు చేయించుకోవాలని ఎంపిపి రమాదేవి సూచించారు. బుధవారం మండల తహశీల్దారు జయశ్రీ,ఎంపీడీవో వేణుగోపారావు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటయ్యతో కలిసి కంటి వైద్య శిబిరాన్ని సందర్శించి పరీక్షలు చేయించుకున్నారు. ప్రజలకు కంటి సమస్యలు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రమేశ్, సర్పంచ్ నర్సింహయాదవ్, వైద్యులు సంపత్‌రెడ్డి, రత్నాకర్,లహరిక, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలిగేడు: మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని బుధవారం ఎంపీడీవో శ్రీనివాసమూర్తి పరిశీలించారు. కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా, సర్పంచ్ భూర్ల సింధూజ, ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, ఎంపీవో అనిల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సౌమ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని బుధవారం ప్రజాప్రతినిధులు పరిశీలించారు. కంటి వెలుగు శిబిరానికి వచ్చే వారికి ఏలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు బొనాల వెంకటస్వామి, ఎంపీటీసీ కోలేటి చంద్రశేఖర్, ఉప సర్పంచ్ బొజ్జ సాగర్, ఎంపీవో ఆరీఫ్, వార్డు సభ్యులు శిబిరాన్ని పరిశీలించారు.

# మేడిపల్లికి పూర్వ వైభవం తీసుకొస్తా

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

జ్యోతినగర్: మేడిపల్లి గ్రామానికి పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం రామగుండం కార్పోరేషన్ మూడో డివిజన్ మేడిపల్లిలో రూ.35 లక్షల సింగరేణి నిధులతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, సీసీరోడ్ల నిర్మాణానికి ఆయన మేయర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, స్థానిక కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్‌తో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యంతోనే మేడిపల్లి గ్రామం అధ్వానంగా తయారైందని, ప్రస్తుతం మేడిపల్లి గ్రామం అభివృద్ధిపై దృష్టి సారించామన్నారు. ఓపెన్‌కాస్ట్–4 మూసివేసినప్పటికీ సింగరేణి సంస్థ యాజమాన్యంపై మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసి ఒత్తిడి తీసుకురావడంతోనే గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, పలువురు పాల్గొన్నారు.

### కేశోరాంలో కార్మికుడికి అస్వస్థత

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కార్మాగారంలో మంగళవారం విధి నిర్వహణలో కర్రె అంజయ్య అనే కార్మికుడు అస్వస్థతకు గురయ్యాడు. కంపెనీ పవర్ ప్లాంట్‌లో విధులు నిర్వహించే అంజయ్య ప్లాంట్‌లో విడుదల అయ్యే హిట్ బడ్ మోటిరిల్ తొలగించే పనులు నిర్వహిస్తుండగా అస్వస్థతకు గురై కింద పడిపోయాడు. అక్కడనే ఉన్న తొటి కార్మికుడు వెంటనే చికిత్స నిమిత్తం అసుపత్రికి తరలించాడు. విషయం తెలుసుకున్న కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షులు సూర సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి కాల్వ అంజయ్యలు బాధితుడిని పరామర్శించారు. అనంతరం సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి అధికారులతో చర్చించారు. కార్మికుల రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట కార్మిక సంఘం నాయకులు పోచమల్లు, శంకర్, రాజేశం, తిరుపతి, తదితరులున్నారు.

### పంచాయతీ రికార్డులు స్వాధీనం

ముత్తారం: మండలంలోని దర్యాపూర్ గ్రామ పంచాయతీ రికార్డులను డీఎల్‌పీవో రాంబాబు స్వాధీనం చేసుకున్నారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు పాలకవర్గ సభ్యుల తీర్మానాలు లేకుండా నిధులు దుర్వినియోగం చేశారని వార్డు సభ్యుల ఫిర్యాదు మేరు ఇటీవల పెద్దపల్లి డీఎల్‌పీవో వేణుగోపాల్ విచారణ చేశారు, కానీ ఏలాంటి వివరాలు సమర్పించలేదు. దీంతో మరల ఫిర్యాదు చేయడంతో మంథని డీఎల్‌పీవో రాంబాబు బుధవారం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఆయన వెంట ఎంపీవో వేణు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

### రన్నింగ్‌లో క్వాలిఫై అయిన వారికి అవకాశమివ్వాలి

పెద్దపల్లిరూరల్: పోలీసు ఉద్యోగాలకోసం దరఖాస్తు చేస్తున్న అభ్యర్థుల్లో రన్నింగ్ లో క్వాలిఫై అయిన వారిని మెయిన్స్ పరీక్షలకు అనుమతించాలని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక జెండా చౌరస్తాలో బుధవారం సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్‌గౌడ్, సునీల్, మల్లయ్య, సంపత్, శ్రీనివాస్, తదితరులున్నారు.

### పాఠశాలకు సరస్వతీ దేవి విగ్రహం వితరణ

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు వసంత పంచమి సందర్భంగా పూర్వ విద్యార్థులు బుధవారం సరస్వతీ మాత విగ్రహం, ప్రమిదలను అందించినట్లు హెచ్ఎం మాధవీలత తెలిపారు. పాఠశాలకు అవసరమైన వంటి వస్తువులను బహుకరించేందుకు ముందుగా వచ్చిన పూర్వ విద్యార్థులైన మురళీమోహన్, దీకొండ భూమేశ్, వెంకన్న, విజయలక్ష్మిలకు హెచ్ఎం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి విరాళం

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ప్రసన్న సీతారామాంజనేయ ఆలయం విరాళం సమర్పించినట్లు ఆలయ కమిటీ సభ్యుడు సర్పంచ్ సముద్రాల రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన కొండ్ల అశోక్‌కుమార్ 1.2 లక్షలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పెట్టెం నారాయణ, అల్లం తిరుపతి, బగ్గని మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

### నేడు సర్వసతీదేవి విగ్రహ ప్రతిష్ఠ

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో గురువారం వసంత పంచమి పురస్కరించుకుని భరోసా స్వచ్ఛంధ సేవాసంస్థ ఆధ్వర్యంలో అక్కినపలి రాజేశం జ్ఞాపకార్థంగా సరస్వతీమాత విగ్రహాన్ని ప్రతిష్ఠంచనున్నట్లు అక్కినపల్లి నాగరాజు తెలిపారు.

**నేడు ఆలయాల అభివృద్ధి పనులకు భూమిపూజ**

రామగిరి: మండలంలోని కల్వచర్లలో బద్దిపోచమ్మ ఆలయనిర్మాణంతో పాటు శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయానికి ప్రహరీ నిర్మాణపనులకు నేడు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రేండ్ల సనత్ కుమార్ భూమిపూజ చేయనున్నారు. గ్రామానికి చెందిన రేండ్ల సనత్ కుమార్, రేండ్ల కుమారస్వామి, రేండ్ల తిరుపతి సోదరులు తన తండ్రి రేండ్ల వెంకటయ్య స్మారకార్థం సొంత ఖర్చులతో ఆలయాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించి నేడు పనులు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### మహిళా చైతన్యానికి ప్రతీక

పెద్దపల్లిరూరల్: ఆధునిక సాంకేతికతతో మహిళల్లో చైతన్యం పెంచేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని జిల్లా అడిషనల్ డీఆర్‌డీవో సునీత అన్నారు. స్థానిక నందనగార్డెన్‌లో వాట్సాప్ సంక్రాంతి ముగ్గుల పోటీల విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, సఖి అడ్మినిస్ట్రేటర్ స్వప్న, కార్యక్రమ ఆర్గనైజర్ డాక్టర్ జవ్వాజి రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

### ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి పెంచుకోవాలి

ఓదెల:రైతులు ఆయిల్‌పామ్ సాగుపై రైతులు ఆసక్తి పెంచుకోవాలని జిల్లా వ్యవసాయాదికారి ఆదిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఓదెల రైతువేదికలో ఆయిల్‌పామ్ పంటసాగుపై రైతులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈసదస్సులో పాల్గొన్న డీఏవో మాట్లాడుతూ అంతర్జాతీయంగా ఆయిల్ ఉత్పత్తికి చాల డిమాండ్ ఉన్నందునా ప్రభుత్వం సబ్సిడీలో మొక్కలను డ్రిప్‌ను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు అనేకమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కునారపు రేణుకదేవి, ఉపసర్పంచు తీర్థాల కుమార్, ఏఈవో సంధ్య, రైతులు పాల్గొన్నారు.

## సింగరేణి వార్తలు

### ఆర్జీ–1 ఏరియా ఉత్తమ ఉద్యోగులు వీరే

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1లో బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకతకు కృషిచేసిన ఉద్యోగులను ఉత్తమ ఉద్యోగులుగా యాజమాన్యం ప్రకటించింది. ఏరియాలోని ఉత్తమ ఉద్యోగులు జీడీకే–1,3 ఏగనిలో సపోర్ట్ మెన్ గంద్ర మధు, ఎలక్ట్రీషియన్ ఎదులాపురం మధుబాబు, జీడీకే–2,2ఏగనిలో ఫిట్టర్ శ్రీపల్లి క్రిష్ణమాచారి, సపోర్ట్‌మెన్ మీస శంకరయ్య, జీడీకే–11గనికి చెందిన జనరల్‌మజ్దూర్ దాసరి రాయమల్లు, ట్రామర్ వెనిశెట్టి వీరయ్య, జీడీకే–5 ఓసీపీకి చెందిన ఈపీ ఆపరేటర్ బద్రి శంకరయ్య, ఈపీ గ్రీజర్ హెల్పర్ మట్ట రాంరెడ్డి పేర్లను యాజమాన్యం ప్రకటించింది. వీరిని గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆర్జీ–1 జీఎం కె.నారాయణ సన్మానించనున్నారు.అలాగే బెస్ట్ సింగరేణియన్‌గా ఈపీ ఆపరేటర్ అడ్డగట్ల గోపి ఎంపిక కాగా, అతడిని కొత్తగూడెంలో సన్మానించనున్నారు.

### ఆర్జీ–2 ఏరియా ఉత్తమ ఉద్యోగులు..

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలోని ఉత్తమ ఉద్యోగుల పేర్లను బుధవారం ప్రకటించారు. ఉత్తమ ఉద్యోగులు వకీల్‌పల్లిగనికి చెందిన మైనింగ్ సర్దార్ మాదం శంకర్, సపోర్టు మెన్ పోతరాజులు రాజయ్య, జనరల్ మజ్దూర్ బండి సమ్మయ్య, ఓసీపీ–3 డ్రిల్ ఆపరేటర్ అరెల్లి మల్లికార్జున్, మెకానిస్టు అండ్ టర్నర్ పెద్దపల్లి రాజేశం, కన్వేయర్ ఆపరేటర్ అడెపు శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. వీరిని గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సన్మానించి బహుమతులు అందజేయనున్నారు. అలాగే ఉత్తమ సింగరేణియన్‌గా అవధూత వెంకటేశ్వర్లు ఎంపిక కాగా, అతడిని కొత్తగూడెంలో జరిగే కార్యక్రమంలో సన్మానించనున్నారు.

### సింగరేణి ఉత్తమ అధికారులు

గోదావరిఖని: విధినిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఉత్తమ అధికారులను బుధవారం యాజమాన్యం ప్రకటించింది. ఆర్జీ–1 ఏరియాలో సెక్యూరిటీ అధికారిగా పనిచేస్తున్న మండల వీరారెడ్డి, ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3లో డీవైఎస్ఎస్ఓగా పనిచేస్తున్న సాంపల్లి నర్సింగరావును ఎంపిక చేశారు. వీరిని కొత్తగూడెంలో జరిగే కార్యక్రమంలో సన్మానించనున్నారు.

## సంక్షిప్త వార్తలు

**ప్రధానికి వందన సమర్పణకు 'ఖని' విద్యార్థి**

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని సెక్రెడ్‌హార్ట్ పాఠశాల విద్యార్థి టి. వైభవ్ నేడు ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ వేడుకల్లో దేశ ప్రధాని నరేంద్రమోడీ వందన సమర్పణలో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ లవ్‌లీ జాకబ్, ప్రిన్సిపాల్ సిస్టర్ జోస్విన్, ఎన్‌సీసీ అధికారి పి.జ్యోత్స్న, విద్యార్థి తల్లిదండ్రులు అభినందించార

**ప్రైవేట్ శక్తుల చేతుల్లో సింగరేణి బందీ**

గోదావరిఖని: ప్రైవేట్ శక్తుల చేతుల్లో సింగరేణి బందీగా మారిందని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. బుధవారం జీడీకే–1వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. పర్మనెంట్ పని స్థలాల్లో కూడా కాంట్రాక్టర్లు చొరబడి సింగరేణి సంస్థను ఆర్థిక దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు కార్యక్రమంలో నాయకులు తోట వేణు, చందర్‌రావు, కుమారస్వామి, రాంచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**దహన సంస్కారాలకు ఆర్థికసాయం**

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలంలోని సంఘం సభ్యులు ఒజ్జ రాజయ్య, ఆరెపల్లి రామయ్య మృతి చెందగా బుధవారం వారి కుటుంబాలకు సంఘం తరుపున దహన సంస్కారాలకు రూ.5వేల చొప్పున బాధిత కుటుంబాలకు చైర్మన్ అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఢిల్లేశ్వర్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు అనంతరెడ్డి, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

**మూడో వార్డు సభ్యుడికి చెక్ పవర్**

మంథని: మండలంలోని మల్లేపల్లి గ్రామ పంచాయతీలో చెక్ పవర్ కోసం మూడో వార్డు సభ్యుడు చెలిమల సంజయ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సర్పంచ్ ఎరుకల తిరుపతమ్మ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీలో బుధవారం ఎంపీవో శేషయ్య సూరి సమక్షంలో సమావేశం నిర్వహించి ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

**దివ్యాంగ విద్యార్థులకు సామగ్రి పంపిణీ**

కమాన్‌పూర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో దివ్యాంగ విద్యార్థులకు బుధవారం చెవి వినికిడి యంత్రాలు, బ్యాటరీ వీల్ చైర్స్ పంపిణీ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పలువురికి వీల్‌చైర్స్, చెవి వినికిడి యంత్రాలను పంపిణీ చేసినట్లు మండల విద్యాధికారి పల్లెపాటి సంపత్ రావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రాచకొండ లక్ష్మి, ఎంపీడీవో విజయకుమార్, సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

**విద్యార్థులకు బెల్టులు పంపిణీ**

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు సెంటినరీకాలనీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం బెల్ట్‌లను పంపిణీ చేశారు. విద్యార్థులకు మరిన్ని సేవలందిస్తామని క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలం సరిత, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బొనాల వెంకటస్వామి, ఎంఈవో పల్లెపాటి సంపత్‌రావు, లయన్స్‌క్లబ్ డైరెక్టర్ గంట వెంకటరమణారెడ్డి, అధ్యక్షుడు మొల్మూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రోటోకాల్ నిబంధనల ఉల్లంఘనపై ఫిర్యాదు

మంథని: మండలం రచ్చపల్లి పునరావాస కాలనీలో ఈ నెల 23న జరిగిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో అధికారులు ప్రోటోకాల్ నిబంధనలు ఉల్లంఘించారని మంథనికి చెందిన న్యాయవాది, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ శశిభూషణ్ కాచే రాష్ట్ర గవర్నర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వేర్వేరుగా పంపిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రచ్చపల్లి పునరావాస కాలనీలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ శిలాఫలకాల్లో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు పేరు ప్రాధాన్యత క్రమంలో చేర్చలేదన్నారు. పట్టభద్రుల నియోజవర్గ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పేర్లను ముద్రించలేదని, కనీసం వారికి సమాచారం ఇవ్వలేదన్నారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు.

### విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రాగి తీగ చోరీ

జ్యోతినగర్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి రాగి తీగెను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బుధవారం ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాకతీయ జూనియర్ కళాశాల సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి రాగి తీగెను చోరీ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టిన సమాచారాన్ని విద్యుత్ అధికారులకు స్థానికులు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన విద్యుత్ విభాగం అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌లోని సుమారు రూ.40 వేల విలువ గల రాగి తీగె చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ముత్తారం: మండలంలోని కేశనపల్లికి చెందిన కోళ్ల కుమార్‌కు రూ. 36 వేల సీఎం సహాయనిధి చెక్కు మంజూరు కాగా, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నూనె కుమార్ బుధవారం లబ్దిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాలు,సతీశ్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.